# బంతిపూల సాగు.. లాభాలు బాగు





బంతి పూలు సాగు చేస్తున్న రైతు వెంకటేశ్

■ 30 గుంటల్లో సాగు ■ ఆదర్శంగా నిలుస్తున్న రైతు బండారి వెంకటేశ్

సారంగాపూర్, అక్టోబర్ 12: తక్కువ పెట్టుబడితో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ ఎక్కువ ఆదాయం పొందుతూ యువ రైతు బండారి వెంకటేశ్ ఆదర్శంగా నిలుస్తున్నాడు. వివరాల్లోకెళ్లే, సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన బండారి వెంకటేశ్ అనే యువరైతు సీజనల్ పంటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నాడు. 11 సంవత్సరాలుగా తనకున్న 9ఎకరాల్లో తన భార్య బండారి విజయతో కలిసి సీజనల్‌గా వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం 30 గుంటల్లో బంతిపూల సాగును చేపట్టి జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో కిలోకు రూ.60 నుంచి 70 వరకు విక్రయిస్తున్నాడు. గత సంవత్సరం నుంచి బంతి పూల సాగుపై ప్రత్యేక దృష్టి సారించి బతుకమ్మ పండుగకు విక్రయించేలా సాగు చేస్తున్నట్లు రైతు వెంకటేశ్ పేర్కొన్నాడు. పూల సాగులో తక్కువ కష్టంతో ఎక్కువ లాభం పొందవచ్చని రైతు పేర్కొంటున్నాడు. అలాగే ప్రతి సంవత్సరం సీజనల్‌గా వివిధ రకాల కూరగాయలను రసాయనాలు ఎక్కువగా వాడకుండా సాగు చేస్తుండడంతో పంటల్లో దిగుబడులు ఎక్కువగా పొందుతూ ఎక్కువ ఆదాయం సంపాదిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

# శరన్నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ దీపాల వెలుగుల్లో రామలింగేశ్వరాలయం

ధర్మపురి, అక్టోబర్ 12: ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ రామలింగేశ్వరాలయంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు దసరా నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ఆలయంలో ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేయనున్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రామలింగేశరస్వామివారి దేవాలయంలో విద్యుత్ దీపాలంకరణ, చుట్టూ లైటింగ్ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

## గంజాయి పట్టివేత

చొప్పదండి, అక్టోబర్12: మండలంలోని చాకుంట ఎక్స్‌రోడ్ వద్ద ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎస్ఐ ఉపేంద్ర చారి పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం .. బుధవారం సాయంత్రం పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించగా, వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా కేజీ డ్రై గంజాయి దొరికింది. వారిని విచారించగా కొలిమికుంట గ్రామానికి చెందిన మాచర్ల అఖిల్, వడ్లూరి వికాస్‌గా గుర్తించారు. వీరు ఫకీర్ పేటకు చెందిన కడప వంశీ నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఇతరులకు అమ్మి డబ్బు సంపాదిస్తున్నామని తెలిపారు. అఖిల్, వికాస్‌ను అదుపులోకి తీసుకొని డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి సరఫరా చేస్తున్న వంశీ పరారీలో ఉన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ లో నలుగురికి జైలు

రాంనగర్, అక్టోబర్ 12: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడిన నలుగురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. కరీంనగర్ పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 20 మంది ని కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా లింగంపెల్లి రమేశ్, పురుషోత్తం కనకరాజుకు 5 రోజులు జైలు శిక్ష, జరిమానా విధించారు. మరో ఇద్దరికి 3 రోజుల జైలు, జరిమానా విధించారు. మిగతా 16 మందికి రూ.26 వేల జరిమానా విధించారు.

## తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలి

చొప్పదండి, అక్టోబర్ 12: ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో పోలీసులు తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ గోపి, సీపీ సుబ్బారాయుడు పోలీసులను ఆదేశించారు. మండలంలోని ఆర్నకొండ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును గురువారం కలెక్టర్, సీపీ సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్, ఎస్ఐ ఉపేంద్రచారికి పలు సుచనలు చేశారు.

# బీఆర్ఎస్ యూత్ కమిటీ సమావేశం



బీఆర్ఎస్ యూత్ సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్

వెల్గటూర్, అక్టోబర్ 12: ఎండపెల్లి మండలం గొడిసెలపేట గ్రామంలో గురువారం బీఆర్ఎస్ యూత్ కమిటీ సమావేశం జరిగింది. బీఆర్ఎస్ మండల యూత్ కన్వీనర్ రామగిరి మల్లేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి ఈశ్వర్ చేపట్టిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెతుకు స్వరూప-స్వామి, ఎంపీటీసీ ముస్కు కవిత-దేవేందర్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు అరికిల్ల మహేందర్, ఉప సర్పంచ్ జెల్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

# బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడికి పరామర్శ

రామడుగు, అక్టోబర్12 : వెంకట్రావుపల్లి అనుబంధ గ్రామం కిష్టంపల్లి బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు జిల్లెల్ల సత్తయ్య తల్లి లస్మమ్మ(80) ఇటీవల మృతి చెందారు. గురువారం బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరామర్శించారు. ఇక్కడ మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, కొక్కెరకుంట సింగిల్‌విండో చైర్మన్ వొంటెల మురళీకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ చింతపంటి అంజయ్య తదితరులు ఉన్నారు.

# డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలి

■ సీ విజిల్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి
■ కలెక్టర్ షేక్ యాస్మిన బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 12: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో డబ్బు, మద్యం, బహుమతుల అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఎన్నికల యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మద్యం, డబ్బు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వినియోగించే బహుమతులు, సరుకల పంపిణీని అరికట్టేందుకు ప్రజల భాగస్వామ్యం కోసం ఏర్పాటు చేసిన సీ ఓటర్ యాప్‌పై ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. మద్యం, డబ్బు, బహుమతులు, ఇతర సరుకులు అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు, పంపిణీ జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు నేరుగా సీ ఓటరు యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామన్నారు. ఫొటో, వీడియోల రూపంలో సైతం సీ ఓటరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు అందుకున్న తక్షణమే సమీపంలోని ఫ్లయింగ్ స్క్వాడ్ సంబంధిత ప్రాంతానికి చేరుకొని చర్యలు తీసుకొని పట్టుబడ్డ నగదు, ఇతర వస్తువులను సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు అప్పగిస్తామన్నారు. ప్రజలు తమకు తెలిసిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 18004257620కు లేదా 1950కు కాల్ చేయాలన్నారు. రూ. 50 వేలకు మించి ఆధారాలు లేకుండా రవాణా చేస్తే సీజ్ చేస్తామని, రూ. 10 లక్షలకు పైగా డబ్బు పట్టుబడితే ఇన్‌కంటాక్స్ శాఖ అధికారులకు తెలియజేస్తామన్నారు. అధిక మొత్తంలో లావాదేవీలు జరుగుతున్న బ్యాంకు ఖాతాలు, కొత్తగా ప్రారంభించిన ఖాతాల వివరాలను అందచేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 18 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సర్వేలైన్స్ టీంలు నిరంతరం పనిచేస్తాయన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు బీఎస్ లత, టీఎస్ దివాకర, ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజేశ్వర్, డీఎస్పీ వెంకటస్వామి, ఎల్‌డీఎం వెంకట్‌రెడ్డి, ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్ మేరీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు బతుకమ్మ వేడుకలు

ధర్మపురి, అక్టోబర్ 12: పట్టణంలోని పాఠశాలల ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. పట్టణంలో కేరళ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బతుకమ్మ పాటలతో ఆడిపాడి తెలంగాణ సంస్కృతిని చాటారు. కరస్పాండెంట్ చిలివేరి శ్యాంసుందర్ పర్యవేక్షించారు..

## 'సమాజ హితాన్ని కోరేదే సాహిత్యం'

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 12 : సమాజ హితాన్ని కోరేదే సాహిత్యమని, వృత్తిపరంగా ఆటో డ్రైవర్ అయిన మహ్మద్ ఖాలీద్ ప్రవృత్తిగా రచనా వ్యాసంగాన్ని ఎంచుకోవడం అభినందనీయమని మామిండ్ల చంద్ర శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కవి మహ్మద్ ఖాలీద్ రచించిన 'మనమంతా ఒక్కటే' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక చింతన, జాతీయ భావం ఖాలీద్ కవితలో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ కలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ సమసమాజ స్థాపనలో కవిత్వానిదే కీలక పాత్ర అన్నారు. ఇక్కడ సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, తడిగొప్పుల కుమారస్వామి, అన్నాడి గజేందర్ రెడ్డి, ప్రేంసాగర్‌రావు, బొమ్మకంటి కిషన్, నగునూరి రాజన్న, దామరకుంట శంకరయ్య, దొమ్మాటి శంకర్, యోగా సంపత్ కుమార్, ఎంఏ బేగ్, బూర్ల వెంకటేశ్వర్లు, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాలి

గంగాధర, అక్టోబర్ 12 : ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో ఎన్ఆర్ మల్హోత్రా సూచించారు. గురువారం గర్శకుర్తి గ్రామాన్ని సందర్శించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు తీరును పరిశీలించారు. గ్రామంలో రాజకీయ పార్టీలకు సంబంధించి ఫ్లెక్సీలు, గోడలపై రాతలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.